జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత

JYYOTHI SHWETHA

దినపత్రిక

హైదరాబాద్ ॥సంపుటి:1 ॥ సంచిక: 3 ॥ మంగళవారం॥ 2-6-2026 ॥ పేజీలు: 8 ॥ వెల 3/-



# వర్షాకాల సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశం

**విపత్తు నిర్వహణకు 1000 కోట్లు**

**విపత్తు నిర్వహణ శాఖ నిధులతో దెబ్బతిన్న రోడ్లు, వంతెనల నిర్మాణం**

**విపత్తుల సమయంలో నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని వార్నింగ్**

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనూ వర్షాభావ పరిస్థితులు ఉన్నందున అంతరాష్ట్ర జలాల్లో ప్రొరేటా ప్రకారం మన వాటా వచ్చేలా ఆయా రాష్ట్రాలతో ముందే చర్చించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్, జూన్ 1: వరదల సమయంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు, కూలిన వంతెనల స్థానంలో కొత్త వాటి నిర్మాణానికి విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000 కోట్లను నిబంధనల ప్రకారం ఖర్చు చేయాలని ముఖ్యమంత్రి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొంటాయన్న అంచనాల నేపథ్యంలో కృష్ణా తరువాయి 2 వ పేజీలో...



# తెలంగాణ అవతరణ వేడుకలకు సిద్ధం

## సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మండుటెండల నేపథ్యంలో ఉదయం 8.30 గంటలకే జెండా ఆవిష్కరణ**

**గంటన్నర వ్యవధిలో పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశం**

**జిల్లాలవారీగా ఉదయం 8 గంటలకే పతాకావిష్కరణలు చేసేలా చర్యలు**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై 11 వసంతాలు పూర్తి చేసుకుని 12వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది.

హైదరాబాద్, జూన్ 1: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జూన్ 2న జరిగే ప్రధాన ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొననున్నారు. రాష్ట్రంలో నెలకొన్న మండుటెండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈసారి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ -2 వ పేజీలో...



# మహారాష్ట్ర సర్కార్ సహకరించకపోయినా... తుమ్మిడిహట్టి పూర్తిచేస్తాం

రాష్ట్రంలో కొత్తగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ మరియు ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించిన ఆయన కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొని కీలక ప్రకటనలు చేశారు. ఆదివాసీల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయిస్తామన్నారు.

## రాష్ట్రంలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

**సెప్టెంబర్ 17న రాష్ట్రవ్యాప్తంగా మరో లక్ష సామూహిక గృహప్రవేశాలు**

**గుడిసెల్లేని ఆదిలాబాద్‌ను చూడాలన్నదే లక్ష్యమని సీఎం స్పష్టీకరణ**

**జూన్ 15 నాటికి కొనుగోళ్లు పూర్తి, ధాన్యం తీసుకోకపోతే కేంద్రంపై సమరమే**

కాగజ్‌నగర్, జూన్ 1: ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇళ్ల బిల్లులు ఆపలేదని, సెప్టెంబర్ 17న మరో లక్ష ఇళ్లకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తామని హామీ ఇచ్చారు. గుడిసెల్లేని ఆదిలాబాద్ జిల్లాను చూడాలన్నదే తన కోరికని, అర్హులైన ప్రతి గిరిజనుడికి ఇల్లు ఇచ్చేలా స్పెషల్ డ్రైవ్ చేపడతామని సీఎం స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్లే కాళేశ్వరంలో పెట్టిన లక్ష కోట్ల రూపాయలు గోదావరి పాల య్యాయని ముఖ్యమంత్రి విమర్శించారు. గత పాలకులు ఆదిలాబాద్ ప్రాజెక్టులను ఏమాత్రం పట్టించుకోలేదని, రెండు లక్షల ఎకరాల కు సాగునీరు అందించే తుమ్మిడిహట్టి బ్యారేజీని ఉద్దేశపూర్వకంగానే పక్కనపెట్టారని ఆరోపించారు. ప్రాణహిత–చేవెళ్ల -2 వ పేజీలో...

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

**తెలంగాణ ప్రగతి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్ష**



హైదరాబాద్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ (జూన్ 2) పర్వదినాన్ని పురస్కరించుకుని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కీలక ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా రాష్ట్ర సాధన పోరాటంలో తరువాయి 2 వ పేజీలో...



# ఫోన్ ట్యాపింగ్ కేసులో హాజరైన యెన్నం, అనిరుధ్

**సిట్ విచారణకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు**

**తల్లి, భార్య ఫోన్లు ట్యాప్ చేశారు: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆవేదన**

**కేసీఆర్ కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్న యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

# ఆంధ్రా నేతల విగ్రహాలు కూల్చేస్తాం..

**తెలంగాణలో ఏపీ నాయకుల పెత్తనాన్ని సహించేది లేదు**

**జనసేన అధినేత పవన్, మంత్రి లోకేష్ లక్ష్యంగా కవిత విమర్శలు**

**ఏపీ ప్రజలతో ఇబ్బంది లేదు.. రాజకీయ నాయకులతోనే సమస్య**

**తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక**

**ఏపీ నాయకులకు రేవంత్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారని ఆరోపణ**

**ఉద్యమకారుల ఆకాంక్షలు - సాధన" రౌండ్ టేబుల్‌లో కవిత**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏపీ నాయకులకు ఏజెంట్‌గా వ్యవహరిస్తూ మళ్లీ ఇక్కడ కుట్రలకు తెరతీశారని కవిత ఆరోపించారు. ఆంధ్రాలో పన్నెండేళ్లయినా రాజధాని కట్టడం చేతకాక ప్రజల దృష్టి మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటు సమయంలో 11 రోజులు పస్తులున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ఈ ప్రాంతంపై ప్రేమ ఎలా ఉంటుందని ప్రశ్నించారు.

హైదరాబాద్, జూన్ 1: ఏపీలో సచివాలయంలోకి నీళ్లు రాకుండా చూసుకోవాలని ఆయనకు చురకలు అంటించారు. తెలంగాణ తల్లిపై కన్నేస్తే సహించేది లేదని, ఇక్కడ దుకాణాలు బంద్ చేసుకున్న లోకేష్, పవన్ తిరిగి రాజకీయాలు చేయాలనుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కవిత డిమాండ్ చేశారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తరువాయి 2 వ పేజీలో...



# జనసేన సభకు అనుమతి నిరాకరణ

**తెలంగాణ పోలీసుల తీరుపై జనసేన అసహనం**

**గచ్చిబౌలిలో సాధక్ సమ్మేళనానికి పోలీసుల బ్రేక్**

**పార్కింగ్ సమస్యను సాకుగా చూపి సభను అడ్డుకోవడం సరికాదన్న నేతలు**

**ప్రొఫెసర్ నాగేశ్వర్ వివాదం ముగిసినా సభను అడ్డుకోవడంపై అసంతృప్తి**

# నేటి రాశి ఫలాలు

**మేషం :** మీ కృషికి తగిన ప్రతిఫలం లభిస్తుంది. శ్రమకు తగ్గ పురోగతి సాధించే అవకాశం ఉంది. వ్యాపార రంగంలో కొత్త అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగంలో చురుకుదనం ప్రదర్శిస్తే ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. సూర్యధ్యానం విజయాన్నిస్తుంది.

**వృషభం :** కృషికి తగిన ఫలితం వస్తుంది. బంధుమిత్రుల సహకారం మీలో ఉత్సాహాన్ని పెంచుతుంది. పాత విభేదాలు తొలగి బంధాలు మెరుగుపడతాయి. విలువైన వస్తువుల కొనుగోలు ఆనందాన్ని కలిగిస్తుంది. శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం నూతన ఉత్సాహాన్ని కలిగిస్తుంది.

**మిథునం :** ఆత్మవిశ్వాసమే మీ విజయానికి ప్రధాన ఆధారం అవుతుంది. ఆటంకాలను సమర్థంగా అధిగమిస్తారు. సమాజంలో గౌరవం, గుర్తింపు పెరుగుతాయి. బంధుమిత్రులతో కలిసి చేపట్టిన పనులు సానుకూల ఫలితాలనిస్తాయి. ఇష్టదేవతా స్తోత్ర పారాయణం ఆత్మబలాన్ని పెంచుతుంది.

**కర్కాటకం :** సహచరుల సహకారంతో పనులు విజయవంతమవుతాయి. స్థిరమైన నిర్ణయాలు మంచి ఫలితాలను అందిస్తాయి. చిన్న చిన్న విభేదాలను పట్టించుకోకుండా ముందుకు సాగాలి. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. శివనామ స్మరణ మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

**సింహం :** ఆటంకాలు ఎదురైనా మనోధైర్యం కోల్పోవద్దు. సహనం, పట్టుదల మీకు విజయాన్ని అందిస్తాయి. ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెడితే మంచిది. ఆలోచించి తీసుకునే నిర్ణయాలు మేలు చేస్తాయి. నవగ్రహ శ్లోక పఠనం ప్రతికూలతలను తగ్గిస్తుంది.

**కన్య :** కొన్ని సవాళ్లు ఎదురైనా పట్టుదలతో విజయాన్ని సాధిస్తారు. కుటుంబ సభ్యుల సలహాలు మార్గదర్శకంగా నిలుస్తాయి. శారీరక శ్రమ పెరిగినా ఫలితం సంతృప్తికరంగా ఉంటుంది. దుర్గా శ్లోక పఠనం ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

**తుల :** మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగ రంగాల్లో అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. ధైర్యంగా ముందడుగు వేస్తే విజయాలు మీవే అవుతాయి. గోవింద నామస్మరణ మనోధైర్యాన్ని, ఉత్సాహాన్ని పెంచుతుంది.

**వృశ్చికం :** భవిష్యత్తుకు అనుకూలమైన పరిణామాలు కనిపిస్తున్నాయి. ఆధ్యాత్మిక కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో శుభఫలితాలు సాధిస్తారు. ఒక శుభవార్త మీలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. సూర్యారాధన విజయమార్గాన్ని చూపుతుంది.

**ధనుస్సు :** మీ ప్రయత్నాలకు తగిన ఫలితాలు లభిస్తాయి. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మిత్రుల సహకారం మేలు చేస్తుంది. మానసిక దృఢత్వం మీకు నూతన అవకాశాలను అందిస్తుంది. శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది. సూర్యశ్లోక పఠనం శుభప్రదం.

**మకరం :** మంచి ఫలితాలు మీకు అనుకూలంగా ఉన్నాయి. శుభ కార్యక్రమాల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకుంటారు. సమాజంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. ఆత్మీయులతో గడిపే సమయం సంతోషాన్నిస్తుంది. ఇష్టదైవ దర్శనం ఆత్మసంతృప్తిని కలిగిస్తుంది.

**కుంభం :** శారీరక శ్రమ అధికంగా ఉన్నప్పటికీ ఫలితం ఆనందాన్నిస్తుంది. బంధువులతో మితంగా, మృదువుగా వ్యవహరించడం మంచిది. ఖర్చులపై నియంత్రణ పాటిస్తే ఆర్థికంగా మేలు జరుగుతుంది. శని ధ్యానం స్థిరబుద్ధిని, సహనాన్ని ప్రసాదిస్తుంది.

**మీనం :** మీ ఓర్పు, సహనం విజయానికి పునాది అవుతాయి. కొన్ని పనులు ఆలస్యమైనా అనుకూల ఫలితాలు తప్పక లభిస్తాయి. భయాందోళనలను దూరంగా ఉండాలి. ధైర్యంగా ముందుకు సాగాలి. ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తే పరిస్థితులు అనుకూలిస్తాయి. నవగ్రహ ధ్యాన శ్లోక పఠనం ధైర్యాన్ని, మనోబలాన్ని పెంచుతుంది.



# సిట్ విచారణకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జూన్ 01: రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసు కుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తమ ఫోన్లు ట్యాప్ అయ్యాయంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నంశ్రీనివాస్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి చేసిన ఫిర్యాదుల మేరకు సిట్ అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. గతంలో జారీ చేసిన నోటీసులకు అనివార్య కారణాలతో వారు హాజరుకాలేకపోవడంతో, తాజాగా 160 సీఆర్పీసీ కింద మరోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో సోమవారం బంజారాహిల్స్‌లోని ఐసీసీసీ కార్యాలయంలో సిట్ అధికారుల ఎదుట ఇద్దరు ఎమ్మెల్యేలు విచారణకు హాజరయ్యారు. ఎన్నికల సమయంలో వీరిద్దరి ఫోన్లు ట్యాప్ అయినట్లు ఇప్పటికే గుర్తించిన అధికారులు.. ఏ ఆధారాలతో వారు ఈ ఫిర్యాదు చేశారన్న కోణంలో వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

### భార్యకు సమాధానం చెప్పుకోలేకపోతున్నా

విచారణ అనంతరం సీఎల్పీ మీడియా హాల్‌లో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వ్యాపారం చేసుకోకుండా రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ పెద్దలు కేవలం తన ఫోన్‌ను మాత్రమే కాకుండా, తన తల్లి, భార్య ఫోన్లను సైతం ట్యాప్ చేశారని మండిపడ్డారు. పెద్ద రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన తన తల్లి ఫోన్‌తో పాటు భార్యాభర్తల మధ్య జరిగే వ్యక్తిగత సంభాషణలను కూడా వినడం ఎంతవరకు సమంజసమని ఆయన నిలదీశారు. వ్యక్తుల గోప్యతకు భంగం కలిగించడం అత్యంత దారుణమన్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తన కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపిందని అనిరుధ్ రెడ్డి వాపోయారు. ఇంటికి వెళ్తే నా భార్య నన్ను తిడుతోంది. నీ వల్లే నా ఫోన్ కూడా ట్యాప్ చేశారని అడుగుతోంది. ఆమెకు నేనేం సమాధానం చెప్పలేకపోతున్నా అంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

### పౌరుల హక్కులను హరించిన కేసీఆర్: ఎమ్మెల్యే యెన్నం

గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి పౌరుల వ్యక్తిగత హక్కులను, గోప్యతను దారుణంగా హరించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మండిపడ్డారు. జడ్జీలు, జర్నలిస్టులు, సినీ నటులు, రాజకీయ నేతల ఫోన్లపై నిఘా పెట్టి, వారి కుటుంబాల్లోకి తొంగిచూస్తూ బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ అనే రాక్షసక్రీడతో క్రూరమైన నేరానికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులకు మళ్లీ ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. పొరపాటున కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తే లక్షల మంది ఫోన్లపై నిఘా పెట్టి, తమకు ఓటు వేయని వారిని పసిగట్టి మరీ వేధిస్తారని హెచ్చరించిన ఆయన.. ఈ కేసులో బాధితులందరికీ తప్పకుండా న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందన్నారు.



# ఆంధ్రా నేతల విగ్రహాలు కూల్చేస్తాం..

మొదటి పేజీ తరువాయి

ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేలా ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఒకవేళ నెల రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే జులై 2న లక్షలాది మందితో ఉప్పల్ భగాయత్‌లోని 350 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. అమరవీరుల కుటుంబాలకు స్వతంత్ర సమరయోధుల హోదా ఇవ్వాలని, కాలయాపన కోసమే వేసిన కమిటీలతో ఒరిగేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు.

### జయశంకర్ సార్ విగ్రహం ఏర్పాటు చేయాలి

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహాన్ని ఆగస్టు 6 లోగా ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత లేఖ రాశారు. 12 ఏళ్లు గడుస్తున్నా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇందుకు తెలంగాణ జాగృతి సంస్థకు అనుమతి ఇస్తే తామే కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ప్రాంగణాన్ని సైతం నిర్వహిస్తామని ఆమె లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కవిత పిలుపునిచ్చారు.

# తుమ్మిడిహట్టి పూర్తిచేస్తాం

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టుపై తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినా స్పందన కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సీఎం అంటే మహారాష్ట్రకు ఎందుకంత చిన్నచూపు అని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వల్ల మహారాష్ట్రకు కలిగే నష్టాన్ని రాష్ట్రమే భరిస్తుందని, ముంపునకు గురయ్యే రెండు వేల ఎకరాల భూమిపై మహారాష్ట్రతో మాట్లాడేందుకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకోవాలని సూచించారు. లేకపోతే ఆదిలాబాద్ ప్రజలు ఉప్పెనలా కదులుతారని హెచ్చరించారు.

### ధాన్యం కొనకపోతే కేంద్రంపై యుద్ధమే

రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఇప్పటికే 62 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, మొత్తం 75 లక్షల క్వింటాళ్లు సేకరిస్తామని, జూన్ 15 నాటికి కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు. రాష్ట్రం సేకరించిన వడ్లు, మొక్కజొన్నలు మరియు జొన్నలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పంటల కొనుగోళ్ల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్రానికి సహకరించకపోతే ఇక్కడ తిరగలేరని హెచ్చరించారు. జూన్ 15 లోపు కేంద్రం స్పందించి ధాన్యం తీసుకోకపోతే యుద్ధం తప్పదని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు.

# రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

మొదటి పేజీ తరువాయి



అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను కేసీఆర్ స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక ఆవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్య యుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిలా మార్చుకున్నామని, పరిపాలన చేతగాదు' అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని కేసీఆర్ అన్నారు. నూతన రాష్ట్రంగా ఏర్పాటైన పదేండ్ల అనతికాలంలోనే సకల జనుల సంక్షేమం, సమస్త రంగాల సమగ్ర ప్రగతిని సాధించి, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుకున్నామని వివరించారు. తెలంగాణ రాష్ట్రం నిరంతరం ప్రగతి పథంలో దూసుకుపోవాలని, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు,సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండాలని కేసీఆర్ ఈ సందర్భంగా కోరుకున్నారు.

# తెలంగాణ అవతరణ వేడుకలకు సిద్ధం

మొదటి పేజీ తరువాయి

వేడుకలను ఉదయం పూటనే త్వరగా ముగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగానే పరేడ్ గ్రౌండ్స్‌లో ఉత్సవాలను ఉదయం 8.30 గంటలకే ప్రారంభించనున్నారు. జాతీయ జెండా ఆవిష్కరణతో పాటు అన్ని కార్యక్రమాలను కేవలం గంటన్నర వ్యవధిలోనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వేడుకలకు హాజరయ్యే అతిథులకు, ప్రజలకు ఎండ వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన తాగునీరు మరియు ఇతర వసతులు కల్పించాలని అధికారులకు సీఎం సూచించారు.

### జిల్లాల్లో పతాకావిష్కరణలు

హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో ముఖ్యమంత్రి జెండా ఎగురవేసే సమయానికి కంటే ముందే, జిల్లాల్లో ఉదయం 8 గంటలకే పతాకావిష్కరణలు నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాలవారీగా జెండా ఎగురవేసే ప్రముఖుల అధికారిక జాబితాను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. అధికారిక ఆహ్వాన పత్రం పొందిన ప్రతినిధులు, అతిథులు అందరూ ఉదయం 8 గంటల కల్లా నిర్ణీత స్థానాల్లో ఆసీనులు కావాలని, ముఖ్యమంత్రి కార్యక్రమం ముగిసి వెళ్లే వరకు వేదిక వద్దే ఉండాలని అధికారులు




స్పష్టం చేశారు.

### నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

వేడుకల నేపథ్యంలో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ముందస్తు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరేడ్ గ్రౌండ్స్ చుట్టుపక్కల రోడ్లపై ఆంక్షలు అమలులో ఉంటాయని మల్కాజ్‌గిరి కమిషనరేట్ పోలీసులు తెలిపారు. బేగంపేట, సంగీత్ జంక్షన్, తిరుమలగిరి, బోయిన్‌పల్లి వైపు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. రద్దీ దృష్ట్యా ప్రయాణికులు మెట్రో రైలు సేవలను వినియోగించుకోవడం ఉత్తమమని, ఎండ తీవ్రత వల్ల ప్రజలు వాటర్ బాటిళ్లు వెంట తెచ్చుకోవాలని పోలీసులు సలహా ఇచ్చారు.

# శ్వేత సంపాదకీయం

**మంగళవారం 2-6-2026**

## తెలంగాణ మేధావులు ఆలోచించాలి!

తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగుపడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రవైటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఆ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి.

ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్‌ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.



# కొనసాగుతున్న ఎండల తీవ్రత

## పలు జిల్లాల్లో గతేడాది కన్నా మిన్నగా ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,జూన్1(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. రుతపవనాలు జాడ ఇంకాలేదు. ఈ క్రమంలో అనేక జిల్లాల్లో ఎండల తీవ్రత పెరిగింది. నిరుటితో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. 22 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.4 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

భానుడి ప్రతాపంతో నిప్పుల కుంపటిగా ఉన్న రాష్ట్రం ఒక్కసారిగా వాతావరణం సాయంత్రం మారింది. ఆదిలాబాద్ జిల్లా రైతులు మార్కెట్ యార్డులో పోసిన జొన్నలు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు పదిరోజుల్లో ప్రవేశించనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రుతుపవనాలు జూన్ 10 నుంచి 12 తేదీల మధ్య రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నది. వచ్చే నాలుగైదు రోజుల్లో కేరళతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాలు రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్టు వెల్లడించింది. వచ్చే నాలుగు రోజులు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని స్పష్టం చేశారు.



## జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల వ్యూహంపై ఖర్గేకు వివరించిన భట్టి

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం న్యూఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (AICC) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో సమావేశమయ్యారు.**

హైదరాబాద్, జూన్ 1 (మన దీపం):పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఇటీవల జార్ఖండ్‌లో పర్యటించిన భట్టి విక్రమార్క, తన పర్యటనలో గమనించిన రాజకీయ పరిణామాలను మరియు కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితిని ఖర్గేకు వివరించారు.జార్ఖండ్‌లో రాజ్యసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో తాను జరిపిన చర్చల గురించి భట్టి విక్రమార్క ఏఐసీసీ చీఫ్‌కు సమాచారం అందించారు. రాజ్యసభ ఎన్నికల్లో సమర్థవంతమైన వ్యూహాన్ని రూపొందించేందుకు 'ఇండియా' (×చీణ×ూా) కూటమిలోని అన్ని భాగస్వామ్య పక్షాలను ఏకం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను ఆయన వివరించారు. ఈ భేటీలో, కూటమి భాగస్వాముల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం మరియు ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగడంపై జార్ఖండ్ స్థానిక నాయకత్వంతో తాను జరిపిన సంప్రదింపులను భట్టి విక్రమార్క ప్రస్తావించారు. కూటమిలోని ఐక్యతను చాటిచెప్పేందుకు జార్ఖండ్ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న కృషిని ఆయన ఏఐసీసీ అధ్యక్షుడికి వివరించారు.




## రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్

న్యూఢిల్లీ, జూన్ 01: కేంద్ర ఎన్నికల సంఘం ఏపీ సహా 10 రాష్ట్రాలలోని 27 రాజ్యసభ స్థానాలకు, అలాగే మూడు రాష్ట్రాలలోని శాసన మండలి స్థానాలకు ప్రతిష్ఠాత్మక ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా ప్రకటించింది. రాబోయే జూన్, జులై నెలల్లో పదవీకాలం ముగియనున్న 24 మంది రాజ్యసభ సభ్యుల స్థానాలతో పాటు, గడువుకన్నా ముందే వివిధ కారణాలతో ఖాళీ అయిన మరో మూడు స్థానాలకు కలిపి మొత్తం 27 సీట్లకు జూన్ 18వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ వెల్లడించింది. ఈ మెగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండగా, అభ్యర్థులు ఈ నెల 8వ తేదీ వరకు తమ నామినేషన్లను దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.ఈ ఎన్నికల కాలపట్టిక ప్రకారం జూన్ 9న నామినేషన్ల పరిశీలన ప్రక్రియ జరగనుండగా, పోటీ నుంచి తప్పుకునే అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి జూన్ 11 వరకు గడువు పొడిగించారు. జూన్ 18న ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే, అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి అత్యంత పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను చేపట్టి ఫలితాలను విడుదల చేయనున్నారు. రాజ్యసభ స్థానాలతో పాటే మూడు రాష్ట్రాల శాసన మండలి స్థానాలకు కూడా ఈ షెడ్యూల్ వర్తించనుండగా, ముఖ్యంగా బిహార్‌లోని తొమ్మిది ఉమ్మడి రాష్ట్ర శాసన మండలి స్థానాలతో పాటు ఖాళీగా ఉన్న మరొక స్థానానికి కూడా ఇదే విడతలో ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

## జేఈఈ అడ్వాన్స్డ్ రిజల్ట్స్ విడుదల

న్యూ ఢిల్లీ, జూన్ 1: దేశంలోని ప్రతిష్ఠాత్మక 23 ఐఐటీల్లో బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం మే 17న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాలు ఆదివారం అర్ధరాత్రి అత్యంత ఉత్కంఠ నడుమ విడుదలయ్యాయి. వాస్తవానికి ఈ ఫలితాలను జూన్ 1వ తేదీన ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, కొన్ని గంటల ముందే అధికారిక వెబ్‌సైట్ యవము్యఎజ.ఖఎ.అఅ లో అందుబాటులోకి ఉంచారు. దేశవ్యాప్తంగా సుమారు 1.90



లక్షల మంది విద్యార్థులు ఈ కఠినమైన పరీక్షకు హాజరవగా.. మొత్తం 56,880 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో ఐఐటీ దిల్లీ జోన్‌కు చెందిన శుభమ్ కుమార్ జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలవగా, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం నారాయణ కాలేజీకి చెందిన విద్యార్థి సందీప్ జాతీయ స్థాయిలో 5వ ర్యాంక్ సాధించి తెలుగు రాష్ట్రాల కీర్తిని చాటారు. ఈ పరీక్షలో నిర్ణీత కనీస మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే ఐఐటీల్లో సీట్ల కోసం పోటీ పడాల్సి ఉండగా, ఐఐటీలతో పాటు ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, మరియు కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సాంకేతిక విద్యాసంస్థల్లో సీట్ల భర్తీకి జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 2వ తేదీ నుంచి అధికారికంగా ప్రారంభం కానుంది. ఐఐటీల్లో చేరడానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ మార్కులు ప్రామాణికం కాగా, కేవలం జేఈఈ మెయిన్ ర్యాంకులు సాధించిన అభ్యర్థులు జోసా కౌన్సెలింగ్ ద్వారా ఎన్ఐటీలు, ట్రిపుల్ఐటీలు, మరియు స్పా వంటి ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందవచ్చు



# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

**తుని సభలో సీఎం చంద్రబాబు**

**కూటమి వచ్చాక రూ.65,887 కోట్ల పెన్షన్ల పంపిణీ**

**తుని నియోజకవర్గంలో వైఖరిని ఏకిపారేసిన సీఎం**

తుని, జూన్ 01: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతల తీరును ఆయన తీవ్రస్థాయిలో ఏకిపారేశారు.గత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి చంపి గుండెపోటు డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు. డీఎస్సీ నిర్వహించి పోస్టులు భర్తీ చేస్తుంటే వైకాపా ఓర్వలేకపోతోంది. రాష్ట్రాభివృద్ధి చూసి ఆ పార్టీకి ఫ్రస్టేషన్ పెరిగిపోతోంది. మత విద్వేషాలు సృష్టించేందుకు కుట్ర పన్నుతోంది" అని మండిపడ్డారు.

**వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే!**

ఇటీవల జరిగిన పలు ఘోరమైన ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను చంద్రబాబు ఎండగట్టారు. నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసి మాపై నెట్టాలని చూశారు. తీరా ఆరా తీస్తే ఆ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని రుజువైంది. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. అబద్ధాలు చెప్పి సానుభూతి కోసం ప్రయత్నించారు. పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలన్నీ బట్టబయలయ్యాయి అని వివరించారు.

**సాక్షాత్తు తిరుమలలోనే అపవిత్ర యత్నాలు**

సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం. దుర్మార్గాలపై యుద్ధం చేస్తూనే సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. వైకాపా అసత్య ప్రచారాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని చంద్రబాబు హెచ్చరించారు.

**విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి**

జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ.1,000 పెంచి రూ.4,000 చేశాం. దివ్యాంగులకు రూ.6,000, ఆరోగ్య పెన్షన్లను రూ.10,000, రూ.15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు. గతంలో ఒక నెల పింఛను తీసుకోకపోతే వెంటనే రద్దు చేసేవారని.. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 3 నెలల వరకు ఇస్తోంది అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం పవన్, తాను కలిసి పని చేస్తున్నామని పేర్కొన్నారు.

**సంక్షేమంతో పాటు ఉపాధి, అభివృద్ధి**

కేవలం ఈరోజు బాగుంటే చాలు అని భావించొద్దని, భవిష్యత్ కూడా బాగుండాలని ఎన్నో ప్రణాళికలు చేపట్టామని సీఎం చెప్పారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. ఇప్పటికే రాష్ట్రానికి భారీ పెట్టుబడులు సాధించాం. విశాఖలో గూగుల్ సంస్థ రూ.15 లక్షల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. పరిశ్రమలు వస్తే మనవాళ్లు ఉద్యోగాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేదు. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ వస్తున్నాయి. పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే అసెంబ్లీలో మహిళలకు 33 శాతం సీట్లు ఇచ్చి రాజకీయంగా ఎదిగేలా చేస్తామని, గ్యాస్ ధరలు పెరిగినా మహిళలకు ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తున్నామని తెలిపారు.

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చే బాధ్యత మాది. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. గతేడాది యోగాంధ్ర బాగా చేశాం, ఈసారి అమరావతి కేంద్రంగా యోగా కార్యక్రమాలు చేపడతాం. రోజుకు అరగంట వ్యాయామం చేస్తే అనారోగ్యాలు రావు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతాం. శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తాం అని పునరుద్ఘాటించారు.

**దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరించిన సీఎం**

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకే పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, దీని కింద పేదలను ఆదుకుంటున్నామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా నిలుస్తున్న 'బంగారు కుటుంబాల'తో ఆయన మాట్లాడారు. అనంతరం, వేదిక వద్దకు వచ్చిన ఓ దివ్యాంగ అభిమానిని చంద్రబాబు ఆప్యాయంగా పలకరించి, అతని భుజంపై చేయి వేసి ఫొటో దిగారు. అతనికి తక్షణమే ప్రభుత్వ సహకారం అందించాలని అక్కడే ఉన్న కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వర్షాకాల సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశం

మొదటి పేజీ తరువాయి

గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా నీరు దక్కేలా చూడాలని అధికారులను అప్రమత్తం చేశారు.

**నీటి వాటా దక్కించుకోవాలి**

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనూ వర్షాభావ పరిస్థితులు ఉన్నందున అంతరాష్ట్ర జలాల్లో ప్రొరేటా ప్రకారం మన వాటా వచ్చేలా ఆయా రాష్ట్రాలతో ముందే చర్చించాలని సీఎం స్పష్టం చేశారు. మహారాష్ట్ర కోయనా డ్యామ్ నీటిని వాడుకుని వారికి అవసరమైన విద్యుత్ మనం సరఫరా చేసే అంశంపై ఆ రాష్ట్రంతో మాట్లాడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

గోదావరి ప్రాణహితల నుంచి వచ్చే వరద నీటిని సముద్రంలో కలవకుండా మళ్లించేలా స్పష్టమైన విధానం రూపొందించాలన్నారు.

**డ్యామ్‌ల గేట్లకు మరమ్మతులు**

రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌ల గేట్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్వహణ లోపాల వల్ల గతంలో కడెం ప్రాజెక్టుకు వచ్చిన ముప్పును ఈ సందర్భంగా గుర్తుచేశారు. మరమ్మతులకు ఎన్ని నిధులు అవసరమైనా వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. డ్యామ్‌ల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామగుండం ఫ్యాక్టరీ యూరియా అంతా రాష్ట్రానికే కేటాయించేలా కేంద్రానికి లేఖ రాస్తామన్నారు.

**అలసత్వం వహిస్తే చర్యలు**

గతేడాది వరదల సమయంలో ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విపత్తుల్లో ప్రాణ ఆస్తి నష్టం జరిగినప్పుడు తక్షణమే స్పందించి బాధితులకు పరిహారం అందేలా చూడాలన్నారు. వర్షాకాలంలో నగర రోడ్లపై నీరు నిలవకుండా చూడాలని, విద్యుత్ అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి కలెక్టర్లు ఎస్పీలు నిరంతరం సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# జనసేన సభకు అనుమతి నిరాకరణ

**తెలంగాణ పోలీసుల తీరుపై జనసేన అసహనం**

**గచ్చిబౌలిలో సాధక్ సమ్మేళనానికి పోలీసుల బ్రేక్**

**పార్కింగ్ సమస్యను సాకుగా చూపి సభను అడ్డుకోవడం సరికాదన్న నేతలు**

**ప్రొఫెసర్ నాగేశ్వర్ వివాదం ముగిసినా సభను అడ్డుకోవడంపై అసంతృప్తి**



హైదరాబాద్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ నిర్వహించ తలపెట్టిన తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ అనగా జనసేన సాధక్ సమ్మేళనానికి ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హాజరుకావాల్సిన ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడం పట్ల పార్టీ శ్రేణులు పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రానికి చెందిన రెండు వేల మంది క్రియాశీలక కార్యకర్తలతో కేవలం ఇండోర్ సమావే శంగా దీనిని ప్లాన్ చేశామని, దీనికి అనుమతి ఇవ్వకపోవడం అర్థరహితమ ని పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. గచ్చి బౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో నిత్యం ఎన్నో సాంస్కృతిక రాజకీయ కా ర్పొరేట్ సంస్థల సమావేశాలు జరుగు తూనే ఉంటాయని జనసేన నాయకు లు గుర్తుచేస్తున్నారు. అప్పుడు ఎప్పుడూ రాని పార్కింగ్ తరువాయి 2 వ పేజీలో...

సమస్య ఇప్పుడు కేవలం జనసేన పార్టీ కార్యక్రమానికి మాత్రమే అడ్డంకిగా చూపించి పోలీసులు అనుమతి నిరాకరించడం ఏమాత్రం సహేతుకం కాదని మండిపడుతున్నారు. ఉద్దేశపూర్వకంగానే సభకు బ్రేక్ వేశారని, భవనంలో అన్ని వసతులు ఉన్నా అధికారులు నిబంధనల పేరుతో ఇబ్బంది పెడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు.

ఇటీవల ప్రొఫెసర్ కె నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలను ఆయనే స్వయంగా ఉపసంహరించుకున్నారని జనసేన వర్గాలు ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాయి. ఆయనపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఎలాంటి చర్యలు ఉండవని పవన్ కళ్యాణ్ సైతం బహిరంగంగానే స్పష్టం చేసినా సభకు అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం. రాష్ట్ర అభివృద్ధిలో జనసేన పోషించాల్సిన పాత్ర మరియు పార్టీ బలోపేతంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేసే కార్యక్రమాన్ని అడ్డుకోవడం పట్ల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారింపు**

రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసుకోవాలనే వ్యూహంలో భాగంగానే జనసేన ఈ కార్యక్రమాన్ని ప్రతిపాదించింది. తెలంగాణ రాష్ట్ర నాయకులు మరియు క్రియాశీలక కార్యకర్తలతో కలిసి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు పవన్ కళ్యాణ్ సిద్ధమయ్యారు. సభకు అనుమతి రాకపోవడంతో న్యాయపరంగా ముందుకు వెళ్లి కార్యక్రమాన్ని నిర్వహించే అంశంపై పార్టీ నాయకత్వం తదుపరి సమాలోచనలు చేస్తోంది.

# నర్సింగ్ విద్యకు ప్రాధాన్యం



**జోగిపేటలో మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యటన**

జోగిపేట, జూన్ 1

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా జోగిపేటలోని నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవనాలను సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. నర్సింగ్ కాలేజీ, హాస్టల్ భవనాలను త్వరలోనే ప్రారంభించే లక్ష్యంతో మిగిలిన సివిల్ పనులను వేగంగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నర్సింగ్ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఆరోగ్య రంగంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నర్సింగ్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నర్సింగ్ విద్యలో వస్తున్న ఆధునిక మార్పులకు అనుగుణంగా శిక్షణ, మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.భవనాల పరిశీలన అనంతరం మంత్రి పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థుల వసతి, తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కాలేజీ ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం నర్సింగ్ కాలేజీ విద్యార్థినులతో మంత్రి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారి సమస్యలు, అవసరాలు, విద్యా సంబంధిత అంశాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తెలిపిన సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఇంజనీరింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

ఆదిలాబాద్, జూన్ 1

జిల్లా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని శ్రద్ధగా పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలను వెంటనే సంబంధిత శాఖలకు పంపించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు సకాలంలో న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలకు జిల్లా పరిపాలన మరింత చేరువవుతోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జగిత్యాల, జూన్ 1

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ధర్మపురి మండలం జైన, దొంతపూర్ గ్రామాలతో పాటు బీర్పూర్ మండల కేంద్రం, తుంగూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. కొనుగోలు ప్రక్రియ, ధాన్యం నిల్వలు, రవాణా ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యం పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా తూకం ప్రక్రియ పూర్తి చేసి మిల్లులకు తరలించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రవాణా ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా, నమోదు ప్రక్రియల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

# ధాన్యం కొనుగోళ్లపై మంత్రి సమీక్ష

సూర్యాపేట, జూన్ 1



రాష్ట్రంలో కొనసాగుతున్న భారీ ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించే లక్ష్యంతో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేట జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. తిరుమలగిరి, ఫణిగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కొనుగోలు ప్రక్రియ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం పరిమాణం, నిల్వలు,రవాణా ఏర్పాట్లు, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా కొనుగోళ్లు కొనసాగించాలని అధికారులకు సూచించారు. మంత్రి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, సూచనలను తెలుసుకున్నారు. ధాన్యం విక్రయానికి వచ్చిన రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకతతో పాటు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కువ కాలం కేంద్రాల్లో నిల్వ ఉండకుండా వెంటనే మిల్లులకు తరలించాలని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం లిఫ్టింగ్ ప్రక్రియను వేగవంతం చేసి కేంద్రాల్లో రద్దీ తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతులకు ఎలాంటి అదన పు భారం పడకుండా రవాణా వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం

**యాభై ఐదు లక్షల మొక్కల లక్ష్యం**



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 1

పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వ్యక్తి తన బాధ్యతగా భావించి ఇందులో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పర్యావరణ పరిరక్షణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల సంరక్షణ, పచ్చదనం పెంపుపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు,పెరుగుతున్న కాలుష్యం, సహజ వనరుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పర్యావరణ చైతన్య కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.జూన్ ఒకటి నుంచి పన్నెండు వరకు జిల్లావ్యాప్తంగా చేపట్టనున్న కార్యక్రమాల్లో ప్రతి గ్రామం, విద్యాసంస్థ, ప్రభుత్వ కార్యాలయం భాగస్వామ్యం కావాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు.

## ధాన్యం తరలింపు వేగవంతం చేయాలి

జనగామ, జూన్ 1

ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపును వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, సమర్థత ఉండేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సోమవారం లింగాల ఘనపురం మండలంలోని



నెల్లుట్ల, నవాబుపేట, వడ్డిచర్ల గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిర్వహిస్తున్న కొనుగోళ్లు, నిల్వలు, రవాణా ప్రక్రియలపై సమగ్రంగా ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటివరకు ఎన్ని లారీలు, ట్రాక్టర్లు ధాన్యాన్ని తరలించాయో, ఏ సమయానికి ఏ మిల్లుకు పంపించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ట్రక్ షీట్లలో నమోదైన వివరాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న అంశాన్ని పరిశీలించారు. అలాగే ఓపీఎంఎస్ నమోదుల పురోగతిపై కూడా సమీక్ష నిర్వహించారు.ధాన్యం రవాణాకు సంబంధించిన అన్ని వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మిల్లుకు వెళ్లిన వాహనాల సంఖ్య, బయలుదేరిన సమయం, రవాణా చేసిన ధాన్యం వివరాలు ట్రక్ షీట్లలో ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరించడంతో పాటు వాటిలో ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్రాల్లో ప్రస్తుతం నిల్వలో ఉన్న ధాన్యం పరిమాణం, కాంటా పూర్తయిన బస్తాల సంఖ్య, మిగిలి ఉన్న నిల్వల వివరాలు, రిజిస్టర్ల నిర్వహణ వంటి అంశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం ఎక్కువ రోజులు కేంద్రాల్లో నిల్వ ఉండకుండా ట్రక్కులు, డీసీఎంలు, ట్రాక్టర్ల ద్వారా వేగంగా మిల్లులకు తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొనుగోలు కేంద్రాల నిర్వహణను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని తెలిపారు.

## బీజేపీ శిక్షణ శిబిరం ప్రారంభం

యాదగిరిగుట్ట, జూన్ 1

భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ - 2026" లో భాగంగా మేడ్చల్ రూరల్ జిల్లా శిక్షణ శిబిరం యాదగిరిగుట్టలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. శిబిరం ప్రారంభానికి ముందు ఈటల రాజేందర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శిబిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫోటో గ్యాలరీని సందర్శించి పరిశీలించారు. పార్టీ చరిత్ర, సిద్ధాంతాలు, ప్రముఖ నాయకుల సేవలను ప్రతిబింబించే చిత్రాలను ఆయన ఆసక్తిగా వీక్షించారు.ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, సిద్ధాంతాల ప్రచారం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల పాత్రపై చర్చలు జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యకర్తలు ప్రజలతో మరింత అనుబంధం పెంచుకుని పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు సూచించారు.శిక్షణ శిబిరం ద్వారా పార్టీ సిద్ధాంతాలు, సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై స్పందన, నాయకత్వ లక్షణాలు వంటి అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించనున్నారు.





## వరంగల్ ఆసుపత్రి పనుల పరిశీలన

వరంగల్, జూన్ 1

వరంగల్ సూపర్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఆసుపత్రి నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, మిగిలిన పనుల పూర్తి స్థితిగతులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. దాదాపు 80 నుంచి 90 శాతం వరకు పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించగా, మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు.



## ప్రజావాణిలో అరవై ఫిర్యాదులు

హైదరాబాద్, జూన్ 1

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.పౌర సమస్యలు, సూచనలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చే వేదికగా ప్రజావాణి కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించిన మొత్తం 60 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.పట్టణ ప్రణాళిక విభాగానికి అత్యధికంగా 34 ఫిర్యాదులు అందగా, ఇంజినీరింగ్ విభాగా నికి 8, ఎన్నికల విభాగానికి 6 ఫిర్యాదులు వచ్చాయి.పట్టణ జీవ వైవిధ్య విభాగానికి 3, విద్యుత్ విభాగానికి 2, పశుసం వర్ధక విభాగానికి 2 ఫిర్యాదులు నమోదయ్యాయి. ప్రకటనలు, పరిపాలన, పట్టణ సమాజ అభివృద్ధి, క్రీడలు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు ఒక్కో ఫిర్యాదు అందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రజలు సమర్పించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ

ఆదిలాబాద్, జూన్ 1

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ యొక్క ప్రాధాన్యతను అధికారులు, సిబ్బందికి వివరించారు. ప్రకృతి వనరుల సంరక్షణ, పచ్చదనం పెంపు, కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతిని కాపాడేందుకు, పచ్చదనాన్ని పెంపొందించేందుకు తమవంతు కృషి చేస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు.



## ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యం

పెద్దపల్లి, జూన్ 1

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు దీర్ఘకాలం పెండింగ్‌లో ఉండకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరితో కలిసి ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. భూ సమస్యలు, గృహాల మంజూరు, రేషన్ కార్డులు, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను సమర్పించారు. ప్రతి దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.





# పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**జూన్ 1 నుంచి 12 వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు**

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డి జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన లక్ష్యంగా జూన్ 1 నుంచి 12 వరకు అటవీ శాఖ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో అవగాహన, ప్రకృతి సంరక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో కార్యక్రమాల వివరాలను తెలియజేస్తూ జిల్లా కేంద్రం, డివిజన్ కేంద్రాలు, విద్యాసంస్థల్లో క్విజ్ పోటీలు, పర్యావరణ సదస్సులు, ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనమహోత్సవం, అధిక సాంద్రతతో మిశ్రమ మొక్కల నాటకం, గృహావసర మొక్కల పంపిణీ, ప్రకృతి సందర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో మొక్కల నాటకం, అటవీ అగ్నిప్రమాదాల నివారణపై ప్రత్యేక ప్రచారం చేపట్టడంతో పాటు విద్యార్థులకు పర్యావరణ విద్యా కేంద్రాలు, అటవీ నర్సరీలు, వన దర్శిని కేంద్రాలకు అధ్యయన పర్యటనలు నిర్వహించనున్నట్లు వివరించారు. జూన్ 12న జరిగే ముగింపు కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు విశేష సేవలందించిన స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, పాఠశాలలు, వ్యక్తులను సత్కరించనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ ప్రజలు, యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధానికి కట్టుబడి పనిచేస్తామని అధికారులు, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.



# ఐఐటీ-జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఇష్టా జూనియర్ కళాశాల ఘన విజయం

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

దేశవ్యాప్తంగా విడుదలైన ఐఐటీ-జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో సంగారెడ్డిలోని ఇష్టా జూనియర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ఘన విజయాలు సాధించారు. జి. సాయి వెంకట్ అఖిల భారత స్థాయిలో 67వ ర్యాంకు, జి. అక్షయ 717వ ర్యాంకు సాధించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారు. విద్యార్థుల ఈ అత్యున్నత విజయాలతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కళాశాల డైరెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శనం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవికిరణ్, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఇబ్రహీం, అధ్యాపకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయాలతో కళాశాల ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడగా, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని కళాశాల కుటుంబం ఆకాంక్షించింది.



# ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించిన ఆయన, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక పోలీసు స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాందోళనలకు లోనుకాకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. మధ్యవర్తులను నమ్మకుండా తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును జిల్లా పోలీసు కార్యాలయం నిరంతరం పర్యవేక్షిస్తూ సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపడుతుందని వెల్లడించారు.

# తారా ప్రభుత్వ కళాశాలలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం

**పొగాకు వినియోగంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించిన ఎన్ఎస్ఎస్ విభాగాలు**




సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించినట్లు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జగదీశ్వర్ వెల్లడించారు. ప్రపంచ దేశాల్లో పొగాకు వినియోగం అధికంగా ఉన్న దేశాల్లో భారతదేశం ఒకటని, యువత పొగాకు, దాని ఉత్పత్తులకు అలవాటుపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరమని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీస్తాయని, ధూమపానం చేసేవారి సమీపంలో ఉండి పొగను పీల్చేవారికీ ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. పొగాకు ఉత్పత్తుల విక్రయం, కొనుగోలు నేరమని పేర్కొంటూ యువత ఈ దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించగా, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**నిర్ణీత గడువులో వినతుల పరిష్కారానికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు**

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో అందిన ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, నిర్ణీత గడువులో పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమం లో ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు తగిన సూచనలు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా డివిజన్‌ల వారీగా నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొత్తం 73 ఫిర్యాదులు అందగా, కలెక్టరేట్‌కు 38, సంగారెడ్డి డివిజన్‌కు 5, ఆందోల్ డివిజన్‌కు 1, నారాయణఖేడ్ డివిజన్‌కు 9, జహీరాబాద్ డివిజన్‌కు 20 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు సంగీత, పాండు, జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలందించాలి

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,



సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సూచించారు. జోగిపేట్ ఏరియా ఆసుపత్రి, తాలేల్మ, నేరేడిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె సిబ్బంది హాజరు నమోదులు పరిశీలించి, విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రులలోని వివిధ విభాగాలు, మందుల నిల్వలను తనిఖీ చేసి గడువు ముగిసిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని స్పష్టం చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు.

# నాణ్యమైన బోధనకు గీతం ప్రోత్సాహం

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులో 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అంశంపై మూడు రోజుల భౌతికశాస్త్ర అధ్యాపకుల వృత్తి వికాస శిక్షణ కార్యక్రమం ప్రారం భమైంది. ఈ సందర్భంగా గీతం అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు మాట్లాడుతూ భౌతికశాస్త్ర అధ్యాపకులను నాణ్యమైన శిక్షణతో ప్రోత్సహించి ఆ రంగ అభివృద్ధికి తోడ్పడాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేషన్ విశాఖపట్నం విభాగం సహకారంతో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ నిపు ణుల నుంచి ఆధునిక భావనలు, ఆచరణాత్మక అనువ ర్తనాలపై అవగాహన పొందాలని సూచిం చారు. గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి. ఆర్. టాటా కార్యక్రమ రూపకల్పనను వివరించగా, సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంత రామకృష్ణ భౌతికశాస్త్ర ప్రాముఖ్యత, శాస్త్రీయ ఆవిష్కరణల ఆర్థిక విలు వపై ప్రసంగించారు. అనంతరం 'విద్యుదయస్కాం తత్వం: కొన్ని నిజ జీవిత అనువర్త నాలు' అంశంపై సాంకేతిక ఉపన్యాసం నిర్వహించారు. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం.రెజా విద్య, పరిశోధనా సౌకర్యాలను పరిచయం చేస్తూ మల్టీడిసిప్లినరీ యూనిట్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రయోగ శాలల ప్రాధాన్యాన్ని వివరించారు. శిక్షణ కార్యక్రమంలో ప్రముఖ శాస్త్రవేత్తలు, ఆచార్యులు పాల్గొని అధ్యాపకుల తో అనుభవాలను పంచుకోగా, కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు.





# జూన్ 3న జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

**పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై విద్యార్థుల్లో అవగాహన పెంపుదల లక్ష్యం**

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్ 3 ఉదయం 10 గంటలకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రవీణ్, జిల్లా పర్యావరణ ఇంజనీర్ ఎస్. విజయలక్ష్మి సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంపొందించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొనవచ్చుని, వ్యాసరచన పోటీకి "ఘన వ్యర్థాల నిర్వహణ - పౌరుల బాధ్యత", వక్తృత్వ పోటీకి "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణలో యువత పాత్ర" అంశాలను నిర్ణయించినట్లు తెలిపారు.విజేతలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నట్లు వెల్లడిస్తూ, ఆసక్తి గల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94410 69020 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.



# రైతులకు సాగునీరు లక్ష్యం

**క్షేత్రస్థాయిలో మంత్రి తుమ్మల సమీక్ష**

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 1


మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను జూలై నెలాఖరులోపు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆయన ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జూన్ నాటికి పూర్తికావాల్సిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని పెండింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం అత్యంత అవసరమన్నారు.పినపాక నియోజకవర్గ రైతులే సీతారామ ఎత్తిపోతల పథకం కోసం మొదటగా భూములు ఇచ్చారని గుర్తు చేసిన మంత్రి, ఈ ప్రాజెక్టు ఫలాలు కూడా ముందుగా ఆ ప్రాంత రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాగునీటి వసతుల విస్తరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు వ్యయం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తి ప్రయోజనాలు అందించేందుకు మరో రూ.9 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని చెప్పారు. ఇప్పటికే పంపిణీ కాలువల నిర్మాణం కోసం రూ.4 వేల కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.



## నాల్కో పనితీరుపై సమీక్ష

న్యూఢిల్లీ, జూన్ 1

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి జాతీయ అల్యూమినియం సంస్థ నాల్కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సంస్థ ప్రస్తుత కార్యకలాపాలు, ఉత్పత్తి లక్ష్యాలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. సమావేశంలో నాల్కో ఉత్పత్తి సామర్థ్యం, గనుల నిర్వహణ, ముడి పదార్థాల లభ్యత, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై సమీక్ష జరిగింది. దేశ ఆర్థికాభివృద్ధికి అనుగుణంగా ఖనిజ, లోహ రంగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, విస్తరణ ప్రణాళికలను వేగవంతం చేయడం, ఖనిజాలు నుంచి తుది ఉత్పత్తుల వరకు విలువ ఆధారిత వ్యవస్థను మరింత బలపరచడం అత్యంత అవసరమని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ అవసరాలను తీర్చేందుకు సంస్థ మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.



## బ్లూటూత్ పేరుతో కలకలం

న్యూజెర్సీ, జూన్ 1

ఒక బ్లూటూత్ పరికరానికి పెట్టిన పేరు అంతర్జాతీయ విమానంలో తీవ్ర కలకలం రేపింది. భద్రతా పరమైన అనుమానాలు తలెత్తడంతో విమాన సిబ్బంది ఎమర్జెన్సీ ప్రకటించి, ప్రయాణాన్ని మధ్యలోనే నిలిపివేసి విమానాన్ని తిరిగి బయల్దేరిన విమానాశ్రయానికే మళ్లించారు. ఈ ఘటన అమెరికా లోని న్యూజెర్సీ రాష్ట్రంలో వెలుగు చూసింది. యునైటెడ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్ విమానం 190 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో నెవార్క్ విమానాశ్రయం నుంచి స్పెయిన్‌కు బయల్దేరింది. ప్రయాణం ప్రారంభమైన కొద్దిసేపటికే విమాన సిబ్బంది బ్లూటూత్ పరికరాల జాబితాను పరిశీలిస్తున్న సమయంలో ఒక డివైజ్ పేరు అనుమానాస్పదంగా కనిపించింది. ఆ పరికరానికి "బాంబ్" అనే పేరు ఉండటాన్ని గమనించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. విమానంలో ఉన్న ప్రయాణికులందరూ తమ మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల్లోని బ్లూటూత్ సదుపాయాన్ని నిలిపివేయాలని పలుమార్లు ప్రకటించారు. అయితే అందరూ సూచనలు పాటించినప్పటికీ ఆ పేరుతో ఉన్న పరికరం మాత్రం నిరంతరం యాక్టివ్‌గా కనిపించింది. దాదాపు రెండు గంటలపాటు పరిస్థితిని గమనించిన సిబ్బంది భద్రతా నిబంధనలను దృష్టిలో ఉంచుకుని గ్రౌండ్ కంట్రోల్ అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఎలాంటి ప్రమాదాన్ని ముందుగానే నివారించాలనే ఉద్దేశంతో ఎమర్జెన్సీ ప్రకటించి విమానాన్ని వెనక్కి మళ్లించాలని నిర్ణయించారు.

# తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

### పరేడ్ రిహార్సల్స్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు అధికారులు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన



వేడుకలను కట్టుదిట్టమైన భద్రత మధ్య ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరేడ్ ఆకర్షణీయంగా, గౌరవప్రదంగా జరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కవాతులో పాల్గొనే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణను ప్రతిబింబించేలా వ్యవహరించాలని, విధుల నిర్వహణలో అలసత్వానికి తావు ఇవ్వకుండా బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పరేడ్ కమాండర్, పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న రిహార్సల్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

## తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం



పరేడ్ రిహార్సల్స్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన పోలీసు అధికారులు

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఆయన వేడుకలను కట్టుదిట్టమైన భద్రత మధ్య ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరేడ్ ఆకర్షణీయంగా, గౌరవప్రదంగా జరిగేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కవాతులో పాల్గొనే ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణను ప్రతిబింబించేలా వ్యవహరించాలని, విధుల నిర్వహణలో అలసత్వానికి తావు ఇవ్వకుండా బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పరేడ్ కమాండర్, పోలీసు సిబ్బంది నిర్వహిస్తున్న రిహార్సల్స్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల సొంతింటి కల సాకారం

### 19వ వార్డు లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం

### సంగారెడ్డిలో పండుగ వాతావరణంలో గృహప్రవేశాలు



సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డి నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన గృహాల గృహప్రవేశ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహిం చగా, పట్టణంలోని 19వ వార్డు బాబానగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, అదనపు కలెక్టర్ సంగీత, మున్సిపల్ చైర్మన్ వనిత, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నాయకత్వం లో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, సొంత ఇల్లు ప్రతి కుటుంబా నికి భద్రత, గౌరవాన్ని కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా వేలాది కుటుంబాలకు శాశ్వత నివాస సౌకర్యం అందుతోందని,అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఇందిరమ్మ ఇళ్లు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే సామాజిక అభివృద్ధి కార్యక్రమమని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కుటుంబ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, స్థానికులు పాల్గొన్నారు.

## బెంగాల్‌లో మంత్రివర్గ విస్తరణ

### ముప్పై ఐదుగురికి అవకాశం

### లోక్ భవన్ కార్యక్రమం

### మరో విస్తరణకు అవకాశం



కోల్‌కతా, జూన్ 1

పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన సువేందు అధికారి నాయకత్వంలోని ప్రభుత్వం తాజాగా మంత్రివర్గ విస్తరణ చేపట్టింది. సోమవారం నిర్వహిం చిన ప్రత్యేక కార్యక్రమంలో మొ త్తం ముప్పై ఐదుగురు భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని లోక్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమం రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. గవర్నర్ ఆర్ ఎన్ రవి నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. రాష్ట్ర ప్రభుత్వంలో కీలక బాధ్యతలు చేపట్టనున్న ఈ మంత్రులు తమ పదవీ బాధ్యతలను త్వరలో స్వీకరించనున్నారు. మంత్రివర్గ విస్తరణ ద్వారా పాలనలో మరింత వేగం తీసుకు రావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ నూట అరవై నాలుగు ఉపనిబంధన ఒకటి ప్రకారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంలో మొత్తం నలభై నాలుగు మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా ముప్పై ఐదుగురికి చోటు కల్పించడంతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రివర్గ సభ్యుల సంఖ్య నలభై ఒకటికి చేరింది. ముగ్గురు సభ్యులకు అవకాశం మిగిలి ఉండటంతో భవిష్యత్తులో మరోసారి మంత్రి వర్గ విస్తరణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల తొమ్మిదో తేదీన సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.ఆ సమయంలో దిలీప్ ఘోష్, అగ్ని మిత్ర పాల్, నిశిత్ ప్రణామిక్, అశోక్ కీర్తనియా, క్షుదిరామ్ టూడు మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇప్పుడు జరిగిన విస్తరణతో ప్రభుత్వానికి మరింత విస్తృతమైన మంత్రివర్గ బలం లభించింది. తాజాగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో దీపక్ బర్మాన్, తపాస్ రాయ్, శంకర్ ఘోష్, మనోజ్ కుమార్ ఒరావోన్, గౌరీ శంకర్ ఘోష్, స్వపన్ దాస్ గుప్తా, కల్యాణ్ చక్రవర్తి, అరుప్ కుమార్ దాస్, దూద్ కుమార్ మోండల్, శరద్వాత్ ముఖర్జీ, జగన్నాథ్ చట్టోపాధ్యాయ్, అర్జున్‌సింగ్,మాలతీ రావా రాయ్, రాజేష్ మహతా, ఇంద్రాని ఖాన్, కౌశిక్ చౌదరి, గార్గి దాస్ ఘోష్, భాస్కర్ భట్టాచార్య తదితరులు ఉన్నారు.అలాగే దిబాకర్ ఘరామి, సుమన సర్కార్, జోయెల్ ముర్మ, అశోక్ దిండా, ఆనందమయ్ బర్మన్, హరేకృష్ణ బేరా, శంతను ప్రమాణిక్, ఉమేష్ రాయ్, పూర్ణిమా చక్రవర్తి, మౌమితా బిశ్వాస్ మిశ్రా, కలితా మాజి, బిషాల్ లామా, అజయ్ కుమార్ పొద్దార్, బిరాజ్ బిశ్వాస్, దీపాంకర్ జానా, అమైరా కిస్కు, నదియార్ చాంద్ బౌరి కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.



## ఆదివాసీల అభ్యున్నతే లక్ష్యం

కొమురంభీమ్ ఆసిఫాబాద్, జూన్ 1

ఆదివాసీ కుటుంబాల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలంటే పిల్లలను తప్పనిసరిగా చదివించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కొఠారి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలోని సిడం కన్నీబాయి, టెకం పగ్గుబాయి, ఆత్రం పోచుబాయిల కొత్త ఇళ్లను కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించి గృహప్రవేశాలు నిర్వహించారు. నూతన సాంకేతికతతో నిర్మించిన ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.ఆదివాసీ మహిళలతో జరిగిన ముఖాముఖి సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి వంటి సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. అయితే ప్రతిఫలంగా తమ పిల్లలను తప్పనిసరిగా చదివించాలని కోరారు. ఒక పూట ఉపవాసం ఉన్నా సరే పిల్లల చదువును ఆపొద్దని విజ్ఞప్తి చేశారు. చదువే జీవితాలను మార్చగల శక్తి అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విద్య ద్వారా మాత్రమే పేదరికం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని, ఆదివాసీ కుటుంబాల భవిష్యత్తు పిల్లల విద్యపైనే ఆధారపడి ఉందని వివరించారు. మహిళల నుంచి పిల్లలను చదివిస్తామని మాట తీసుకున్నారు.రాష్ట్రవ్యాప్తంగా రెండో విడతగా మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమాన్ని కూడా కొత్తగూడ నుంచే ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. గూడాలు, తండాలు, ఐటీడీఏ ప్రాంతాల్లో నివసించే ప్రతి అర్హ కుటుంబానికి ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణను నిర్మించాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు మధ్యలో ఆపకుండా పూర్తి చేయాలని సూచించిన ముఖ్యమంత్రి, మహిళా సంఘాలకు అందించే రుణ పరిమితిని పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,జూపల్లి కృష్ణారావు, సీతక్క, వివేక్ వెంకటస్వామి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



## పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

### మన్సాన్‌పల్లిలో లబ్ధిదారులతో గృహప్రవేశాలు నిర్వహించిన దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 01,

సంగారెడ్డి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తయిన గృహాల ప్రారంభోత్సవాలు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారుల ఇళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించి గృహప్రవేశాలు నిర్వహించారు. ఆందోల్ మండలం మన్సాన్‌పల్లిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నీరుడి జ్యోతి, గొల్ల లావణ్య, వంగ సుజాతలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దశాబ్దాలుగా గూడు కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు మాత్రమే కాకుండా కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని అందించే ఆస్తి అని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యమని వెల్లడించారు. లబ్ధిదారులు సొంత ఇంటి కల నిజం కావడం జీవితంలో మరపురాని ఆనందమని పేర్కొంటూ ప్రభుత్వం కల్పించిన అవకాశంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు, స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.





# ఆర్సీబీ విజయాల వెనుక అసలైన శిల్పి ఆండీ ఫ్లవర్

**వరుసగా రెండోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను సొంతం చేసుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయాల వెనుక ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తిగా ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ పేరు మార్మోగుతోంది. ఎన్నో ఏళ్లుగా స్టార్ ఆటగాళ్లతో నిండినప్పటికీ ట్రోఫీకి దూరంగా నిలిచిన బెంగళూరునుఛాంపియన్ జట్టుగా తీర్చిదిద్దడంలో ఫ్లవర్ కీలక పాత్ర పోషించాడు.**

అహ్మదాబాద్, జూన్ 1

. ఆగస్టు 2023లో ప్రధాన కోచ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆండీ ఫ్లవర్ జట్టులో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాడు. వ్యక్తిగత ప్రతిభ కంటే జట్టు సమష్టి ప్రదర్శనకు ప్రాధాన్యం ఇవ్వాలనే సిద్ధాంతంతో ముందుకు సాగాడు. స్టార్ ఆటగాళ్లపై ఆధారపడే సంస్కృతిని మార్చి, ప్రతి ఆటగాడి పాత్రకు విలువ ఇచ్చే విధానాన్ని అమలు చేశాడు. బెంగళూరును గతంలో తీవ్రంగా ఇబ్బంది పెట్టిన బౌలింగ్ సమస్యను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాడు. అనుభవజ్ఞుడైన భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకురావడంతో పాటు యువ ఆటగాడు రసిఖ్ సలామ్‌కు అవకాశాలు కల్పించాడు. ఈ ఇద్దరూ గత రెండు సీజన్లలో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిం చారు. తుది జట్టులో ఉన్న ఆటగాళ్లతో పాటు బెంచ్‌పై ఉన్న వారికీ సమాన ప్రాధాన్యం ఇవ్వడం ఫ్లవర్ ప్రత్యేకతగా నిలిచింది. జట్టు సంస్కృతిని మార్చిన కోచ్‌గా ఆండీ ఫ్లవర్‌ను కెప్టెన్ రజత్ పటీదార్ ప్రశంసించాడు. ప్రతి ఆటగాడితో వ్యక్తిగతంగా మాట్లాడి ఆత్మవిశ్వాసాన్ని పెంచే కోచ్‌గా ఆయనను అభివర్ణిం చాడు. యువ ఆటగాళ్లకు స్పష్టమైన మార్గనిర్దేశం చేసి వారిలో నమ్మకాన్ని పెంపొందిం చడంలో ఫ్లవర్ పాత్ర అమూల్యమని పేర్కొన్నాడు. గుజ రాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్లో బెంగళూరు విజయంతో మరోసారి ఆండీ ఫ్లవర్ వ్యూహాలు ఫలించాయి. మైదానం లో ఆటగాళ్లు రాణించినప్పటికీ, తెరవెనుక విజ యానికి బాటలు వేసింది ఫ్లవర్ రూపొందించిన ప్రణాళి కలేనని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫైనల్ విజయా నంతరం బెంగళూరు ఆటగాళ్లు ఐస్ క్యూబ్‌లతో నిండిన బకెట్‌ను ఆండీ ఫ్లవర్‌పై కుమ్మరించి ఆనందం పంచుకో వడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జట్టులో ఆయనకు ఉన్న గౌరవం, అభిమానానికి అది నిదర్శనంగా మారింది. జింబాబ్వే క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ఆండీ ఫ్లవర్, టెస్ట్ క్రికెట్‌లో 4,794 పరుగులు, వన్డేల్లో 6,786 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్‌గా కూడా అద్భుతమైన రికార్డులు నమోదు చేశాడు.




# మూడేళ్లలో రూ.50 వేల కోట్ల లక్ష్యం

## విస్తరణపై ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ దృష్టి

ముంబై, జూన్ 1

తక్కువ, మధ్యతరగతి ఆదాయ వర్గాలకు గృహ రుణాలు అందిస్తున్న ప్రముఖ సంస్థ ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ రాబోయే మూడేళ్లలో తన నిర్వహణలోని ఆస్తుల విలువను రూ.50 వేల కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం సంస్థ రుణాల పంపిణీలో స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తుండటంతో ఈ లక్ష్యాన్ని చేరుకోవడంపై యాజమాన్యం విశ్వాసం వ్యక్తం చేసింది.

సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన కార్యనిర్వాహక అధికారి రిషి ఆనంద్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది 18 నుంచి 20 శాతం వరకు రుణ వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి సంస్థ నిర్వహణలోని ఆస్తుల విలువ రూ.30,571 కోట్లకు చేరిందని వెల్లడించారు.

# బ్లింకిట్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసు

న్యూఢిల్లీ, జూన్ 1

క్విక్ కామర్స్ రంగంలో ప్రముఖ సంస్థ బ్లింకిట్ మరోసారి వివాదంలో చిక్కుకుంది. సంస్థ ద్వారా ఆర్డర్ చేసిన పెరుగు తిన్న తర్వాత అస్వస్థతకు గురైనట్లు ఓ వినియోగదారు చేసిన ఫిర్యాదు దేశవ్యాప్తంగా చర్చనీయా ంశమైంది. ఈ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించిన భార త ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ ఎఫ్ఎస్ ఎస్ఏఐ బ్లింకిట్‌కు నోటీసు జారీ చేసి, 24 గంటల్లోగా పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఫిర్యాదు ప్రకారం, బ్లింకిట్ వేదిక ద్వారా కొనుగోలు చేసిన పెరుగు వినియోగించిన అనంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తి నట్లు వినియోగదారు పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్పందించిన ఎఫ్ఎస్ఎస్ఏఐ విచారణ ప్రారంభించింది. సంబంధిత ఉత్పత్తి నాణ్యత తనిఖీలు, ఫిర్యాదుపై సంస్థ చేపట్టిన చర్యలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకుం టున్న జాగ్రత్తలపై సమ గ్ర వివరాలు అందించాలని బ్లింకిట్‌ను ఆదేశించింది.



# శ్రీలంక సిరీస్‌కు వెస్టిండీస్ జట్టు ప్రకటన..

**వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచ కప్‌కు అర్హత సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న వెస్టిండీస్ క్రికెట్ జట్టు, శ్రీలంకతో జరగనున్న మూడు వన్డేల సిరీస్ కోసం పటిష్టమైన జట్టును ప్రకటిం చింది. షాయ్ హోప్ సారథ్యంలో 15 మంది సభ్యులతో కూడిన జట్టును సెలెక్టర్లు ఎంపిక చేశారు. అనుభవజ్ఞులు, యువ ఆటగాళ్ల సమతుల్య కలయికతో ఈ జట్టును రూపొందించడం విశేషం.**

కింగ్‌స్టన్, జూన్ 1

జూన్ 3 నుంచి స్వదేశంలో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనున్న వెస్టిండీస్, ఈ సిరీస్‌ను అత్యంత ప్రతిష్ఠా త్మకంగా తీసుకుంటోంది. ఇటీవల కాలంలో వన్డే క్రికెట్‌లో ఆశించిన ఫలితాలు సాధించ లేకపోయిన కరీబియన్ జట్టు, ఈ సిరీస్ ద్వారా కొత్త ఆత్మవిశ్వాసాన్ని పొందాలని భావిస్తోంది. జట్టులో సీనియర్ ఆల్‌రౌండర్ రోస్టన్ ఛేజ్‌కు మరోసారి అవకాశం లభించి ంది. వేగవంతమైన బౌలింగ్‌తో ఆకట్టుకుం టున్న యువ పేసర్లు షమర్ జోసెఫ్, జైడెన్ సీల్స్ కూడా జట్టులో చోటు దక్కించుకు న్నారు. గాయాల నుంచి పూర్తిగా కోలుకున్న అల్జారీ జోసెఫ్ తిరిగి జట్టులోకి రావడం బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూర్చింది. ఇటీవల జరిగిన ఐపీఎల్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయినప్పటికీ షిమ్రన్ హెట్‌మైర్, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్‌లపై సెలెక్టర్లు నమ్మకం ఉ ంచారు. వీరిద్దరూ మిడిలార్డర్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. జట్టులో అకీమ్ ఆగస్టే, జాన్ క్యాంప్‌బెల్, కేసీ కార్టీ వంటి బ్యాటర్లు కూడా స్థానం సంపాదించారు. స్క్వాడ్ ప్రకటన అనంతరం ప్రధాన కోచ్ డారెన్ సమీ మాట్లాడుతూ, వెస్టిండీస్‌ను స్వదే శంలో బలమైన వన్డే జట్టుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని వెల్లడించాడు. వ్యక్తిగత ప్రదర్శనల కంటే జట్టు విజయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని, గత 18 నెలలుగా ఇదే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నాడు. ప్రపంచకప్ అర్హత పోటీలకు ముందు ఈ సిరీస్ తమకు ఎంతో కీలకమని ఆయన అభి ప్రాయపడ్డాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఆల్‌రౌం డర్లతో సమతుల్యంగా కనిపిస్తున్న ఈ జట్టుపై అభిమానుల్లో ఆశలు పెరిగాయి. స్వదేశంలో జరిగే ఈ సిరీస్‌లో శ్రీలంకపై ఆధిపత్యం చాటుతూ ప్రపంచకప్ ప్రయాణా నికి విజయ వంతమైన ఆరంభం ఇవ్వాలని వెస్టిండీస్ భావి స్తోంది. వెస్టిండీస్ జట్టు: షాయ్ హోప్ (కెప్టెన్), అకీమ్ ఆగస్టే, జాన్ క్యాంప్‌బెల్, కేసీ కార్టీ, రోస్టన్ ఛేజ్, మాథ్యూ ఫోర్డే, జస్టిన్ గ్రీవ్స్, షిమ్రన్ హెట్‌మైర్, అమిర్ జంగూ, అల్జారీ జోసెఫ్, షమర్ జోసెఫ్, గుడకేశ్ మోతీ, షెర్ఫానే రూథర్‌ఫోర్డ్, జైడెన్ సీల్స్, షమర్ స్ప్రింగర్.

# చివరి గంటలో కుప్పకూలిన విపణులు

ముంబై, జూన్ 1

దేశీయ మూలధన విపణులకు సోమవారం తీవ్ర నిరాశ ఎదురైంది. ఉదయం అంతర్జా తీయ పరిణామాల సానుకూల ప్రభావంతో లాభాల్లో సాగిన సూచీలు, మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనై భారీ నష్టాలతో ముగిశాయి. రోజంతా లాభాల దిశగా పయనించిన పెట్టుబడి విపణు లు చివరి గంటలో పూర్తిగా బలహీనపడి క్షీణత బాట పట్టాయి. ఉదయం గరిష్ఠ స్థా యులను తాకిన ప్రధాన సూచీలు, ముగింపు సమయానికి గణనీయంగా దిగజారాయి. ముఖ్యంగా మధ్యాహ్నం మూడు గంటల తర్వాత పరిస్థితి వేగంగా మారిపోయింది. పశ్చిమాసియాలో ఉ



ద్రిక్త పరిస్థితులు నెలకొనడం ఇందుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు పేర్కొంటున్నారు. అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరగడంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదా రుల్లో ఆందోళన నెలకొంది. ఇరు దేశాలు పరస్పర దాడులకు దిగినట్లు వెలువడిన సమాచారం ఆర్థిక రంగంపై ప్రతికూల ప్రభావం చూపింది.

# లింగ వివక్ష వ్యాఖ్యలు..

## టెన్నిస్ ఆటగాడికి భారీ జరిమానా

పారిస్, జూన్ 1

ప్రతిష్ఠాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీలో లింగ వివక్షపూరిత వ్యాఖ్యలు చేసిన ఓ టెన్నిస్ ఆటగాడిపై నిర్వాహకులు కఠిన చర్యలు తీసుకున్నారు. మహిళా చైర్ అంపైర్‌ను అవమానించేలా వ్యాఖ్యానించిన పెరుగ్వే ఆటగాడు అడాల్ఫో వల్లెజోకు భారీ జరిమానా విధించడం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. టోర్నీలో రెండో రౌండ్ మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడిన అడాల్ఫో వల్లెజో, తన మ్యాచ్‌కు మహిళా చైర్ అంపైర్ బదులుగా పురుష అంపైర్‌ను నియమించి ఉ ంటే బాగుండేదని వ్యాఖ్యానించాడు. ప్రేక్షకుల హోరాహోరీ అరుపులు, కోర్టులో నెలకొన్న వాతావరణాన్ని నియంత్రించడం మహిళా అంపైర్‌కు కష్టమని చెప్పడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఆ మ్యాచ్‌కు చైర్ అంపైర్‌గా వ్యవహరించిన అనా కర్వాల్హోను లక్ష్యంగా చేసుకుని చేసిన ఈ వ్యాఖ్యలను నిర్వాహకులు తీవ్రంగా పరిగణించారు.

"This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948**, Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467